
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3, కనిష్ఠం 26.4



వడ్డీ వ్యాపారులపై కొరడా







నగరంలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో తనిఖీ చేస్తున్న పోలీసులు

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో 45 చోట్ల పోలీసుల తనిఖీలు
- పలుచోట్ల డాక్యుమెంట్లు, ఏటీఎం కార్డులు, చెక్కులు, నగదు సీజ్
- విషయం తెలియడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిన మరికొందరు వ్యాపారులు
- మనీ ల్యాండరింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్న అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝులిపించారు. ఒకేసారిగా జిల్లా అంతటా తనిఖీలను చేపట్టారు. ప్రధానంగా ఫిర్యాదులు వచ్చిన వారిపై నజర్ పెట్టి ఏకకాలంలో తనిఖీలను కొనసాగించారు. ఈ తనిఖీలో భాగంగా పెద్ద ఎత్తున డాక్యుమెంట్లు, ఏటీఎం కార్డులు, నగదు, బంగారంతో పాటు ఇతర వస్తువులను సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధిక వడ్డీకి డబ్బులు ఇస్తున్న వారిపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

భారీగా వడ్డీ వసూళ్లు

జిల్లాలో గత కొన్నేళ్లుగా వడ్డీ వ్యాపారుల పీడన ఎక్కువైంది. అవసరాల కోసం అప్పులు తీసుకున్న వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున వడ్డీ వసూలు చేస్తున్నారు. కొంతమంది కట్టకపోతే వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో పెద్ద ఎత్తున ఈ వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది. ఈ వ్యాపారం చేసేవారు ఎలాంటి అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. లక్షల రూపాయలు అప్పులుగా ఇస్తున్నారు. వడ్డీలు రెండు నుంచి ఆరు శాతం వరకు వసూళ్లు చేస్తున్నారు. నిర్ణీత సమయంలో ఇవ్వని వారి నుంచి పెద్ద ఎత్తున వడ్డీలను పెంచుతూ ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా వీరు దోపిడిపై పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. కొంత మంది ఆస్తులను కూడా పోగొట్టుకున్నారు. రెండేళ్ల క్రితం ఈ వడ్డీ వ్యాపారుల వేదింపులకు తాళలేక ఒక కుటుంబానికి చెందిన నలుగురు విజయవాడకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుడు ఈ వ్యాపారులపై కొంత నజర్ పెట్టిన తర్వాత పట్టించుకోకపోవడం వీరు పలు పార్టీల నుంచి ఒత్తిళ్లు పెంచడం వల్ల కొంత మేర కేసులు తగ్గాయి. ఈ వడ్డీ వ్యాపారులు మాత్రం మళ్లీ ఎక్కువ మొత్తంలో వసూలు చేయడం వల్ల గత కొన్ని నెలలుగా కేసులు నమోదు అవుతున్నాయి. పలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు పెరిగాయి. నేరుగా నగర పోలీసు కమిషనర్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వీటిపై స్పందించిన పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. వడ్డీ వ్యాపారం చేసే వారు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అప్పులను ఇవ్వాలి. ఆ నిబంధనల ప్రకారమే వడ్డీని వసూలు చేయాలి. చట్టబద్ధంగా టాక్సులను కూడా చెల్లించాలి. జిల్లా పరిధిలో చేస్తున్న ఈ వడ్డీ వ్యాపారులు ఎక్కడ కూడా అనుమతులను తీసుకోవడం లేదు. ఎక్కువ వడ్డీ కొనసాగిస్తున్నారు. అప్పులు ఇచ్చే సమయంలో తక్కువ వడ్డీ పేరు చెప్పి వారికి సంబంధించిన ఆస్తులను తనఖా పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులైతే వారి ఏటీఎం కార్డులు, షూరిటీలు తీసుకుంటున్నారు. ఇవిలేని వారికి వ్యవసాయ భూములు, ఇతర ఆస్తులను తనఖా పెట్టుకుంటున్నారు. కొంత మంది వడ్డీ వ్యాపారులు వారి పేరు మీద జీపీఏ చేసుకుంటున్నారు. మరికొంత మంది భూములను, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకొని అప్పులు ఇస్తున్నారు. నిర్ణీత సమయంలో అప్పులు చెల్లించని వారికి చక్రవడ్డీ వేసి వసూళ్లు చేస్తున్నారు. లక్షల రూపాయల టాక్స్‌లను ఎగ్గొడుతూ నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లను కొనసాగిస్తున్నారు. వీరి దందా పెద్ద ఎత్తున ఉండటం చెల్లింపులు ఆలస్యమైతే తమ అనుచరులను తీసుకువెళ్లి బెదిరించడం ఆస్తులను తీసుకొని రావడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ఫిర్యాదులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ మధ్య ఎక్కువగా నమోదు అయ్యాయి.

ఆర్మూర్‌టౌన్/సిరికొండ: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదైనట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే సిరికొండలో చట్టవిరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న ఇద్దరి ఇళ్లపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. సిరికొండ గ్రామానికి చెందిన గోదావరి సేట్, గురుడు రాజేశ్వర్ ప్రభుత్వ అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్నారనే సమాచారంతో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో దాడులు చేసి అప్పు పత్రాలను స్వాధీనం చేసుకుని వీరిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

జిల్లాలో 45 చోట్ల తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికలు ఉండటం ఈ ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో పోలీసులు ఒకేసారి జిల్లాలో 45 చోట్ల ఈ తనిఖీలను చేపట్టారు. నిజామాబాద్ నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలను చేస్తున్నారు. ఆర్మూర్, బోధన్ సబ్ డివిజన్ పరిధిలో కూడా ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు.

22 పోలీసు స్టేషన్ పరిధిలో..

జిల్లాలోని 22 పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం నుంచే ఈ తనిఖీలను చేపట్టారు. ఒకేసారి అన్ని చోట్ల ఈ తనిఖీలను కొనసాగించడంతో వడ్డీ వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. తనిఖీలు అయ్యే వ్యాపారులు మినహాయించి మిగతా వారు ఈ సమాచారం తెలియగానే ఇండ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. డాక్యుమెంట్లు, బంగారం, ఇతర వస్తువులను వేరే ప్రాంతాలకు తరలించారు. పోలీసుల తనిఖీలో భారీ ఎత్తున డాక్యుమెంట్లు దొరికాయి. ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు పోస్ట్ డేటెడ్ చెక్కులు, బంగారం, నగదు, ఏటీఎం కార్డులు, స్టాంప్ పేపర్లు, ఇతర వస్తువులను తనిఖీలో భాగంగా సీజ్ చేశారు. ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లా అంతటా తనిఖీలు పూర్తయిన తర్వాత పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. మరికొన్ని రోజుల పాటు కూడా ఈ తనిఖీలను కొనసాగించనున్నారు. జిల్లాలో వడ్డీ వ్యాపారులపై వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా ఈ తనిఖీలను కొనసాగించినట్లు నగర పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. జిల్లాలో అన్ని చోట్ల తనిఖీలు జరుగుతున్నాయని అన్నారు. మొత్తం తనిఖీలు పూర్తయిన తర్వాత వివరాలను వెల్లడిస్తామని ఆయన తెలిపారు. తనిఖీలో బయటపడ్డ వాటిని బట్టి కేసులను కూడా నమోదు చేస్తామని అన్నారు. మనీ ల్యాండరింగ్ చట్టం ప్రకారం కేసులను పెడతామన్నారు. ఈ తనిఖీలు ఒకేసారి జరగడంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష

- అధికారులకు దిశా నిర్దేశం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల కానుండగా ఆరోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పక్కాగా పరిశీలించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చేపట్టిన చర్యల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన, ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన సిబ్బందికి శిక్షణ తరగతులు, తనిఖీ బృందాలు, చెక్‌పోస్టులు, భద్రతాపరమైన చర్యలు, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం నిల్వలు, ఇతర విలువైన వస్తువులు తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఎక్కడ కూడా ఏ దశలోనూ తప్పిదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పకడ్బందీగా వ్యవహరించాలని ఎన్నికల సంఘం నియమనిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, స్వీప్ అధికారి సురేష్, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: సమాజానికి పెను సవాల్‌గా మారిన మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, తదితర అంశాలపై సమావేశంలో చర్చించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో మరింత గట్టిగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లు, రైలుమార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి జిల్లాకు చేరుతున్నాయి, ఏఏ ప్రాంతాల్లో ఎవరు వీటిని విక్రయిస్తున్నారు, కల్తీకల్లు తయారీ కోసం వినియోగించే ఆల్ప్రోజోలం నిల్వల గురించి ఆరా తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దిశగా పోలీస్, ఎక్సైజ్, రవాణా, తదితర శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శన్, వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, అటవీ, రవాణా, వాణిజ్యపన్నుల, ఔషధ నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.





బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిలువల కొరత

- అత్యవసర వైద్యసేవలకు రోగుల ఇబ్బందులు
- వేసవికాలం కావడంతో ముందుకు రాని రక్తదాతలు
- బోధన్ ఆసుపత్రి అందుబాటులో ఆరు యూనిట్లే
- నెగిటివ్ బ్లడ్ గ్రూప్ రోగులకు తీవ్ర ఇబ్బందులు
- రక్తదాతలు ముందుకురావాలంటున్న వైద్యులు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 15: జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల్లో రోజురోజుకూ రక్తం నిలువలు తగ్గుతుండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. శస్త్ర చికిత్సలు, అత్యవసర చికిత్సలకు అవసరమయ్యే రక్త నిలువలు లేక రోగులు అల్లాడుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించేందుకు బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తోపాటు ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌లు ప్రస్తుతం రక్తపు నిల్వలు సరిపడా లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. అత్యవసర వైద్య సేవలకు రక్తం లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నెగెటివ్ గ్రూప్ వారైతే మరింత అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం వేసవికాలం కావడం వల్ల రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు వాపోతున్నారు. బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజీ సెంటర్ ఉన్నా.. రక్త యూనిట్లు పూర్తిస్థాయిలో లేవు. ఆరు యూనిట్ల పాజిటివ్ రక్త యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వేసవి కారణంగా రక్త నిల్వల కొరత పెరుగుతుండడం కలవర పెడుతోంది.

అందుబాటులో ఆరు యూనిట్లే..

బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ అధికారులు నిత్యం రక్తాన్ని స్వీకరించి దానిని నిల్వ చేసి ఆపదలో ఉన్న వారికి అందిస్తారు. ఆసుపత్రిలో రోగులతో పాటు బ్లడ్ బ్యాంక్ స్టోరేజీలు ఉన్నకాన్పులకు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందిస్తారు. ఆసుపత్రిలో మార్చి నెలలో 73యూనిట్ల రక్తం అందుబాటులో ఉండేదని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు. రక్తం ఏప్రిల్ మొదటి వారంలో రక్త దాతలు లేకపోవడంతో కేవలం ఆరు యూనిట్ల పాజిటివ్ రక్తమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ క్రమంలో నెగటివ్ బ్లడ్ గ్రూపులకు తీవ్ర రక్తం కొరత ఏర్పడుతుంది. అంతేకాక పాజిటివ్ బ్లడ్ గ్రూపులు ఉన్నవారికి కొంత ఉపశమనం ఉన్నా.. మున్ముందు ఈ రక్త నిల్వలు కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

వేసవిలో ముందుకు రాని దాతలు

వేసవిలో రక్తదాతలు తగ్గుతున్నట్లు బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతినెలా బ్లడ్ బ్యాంక్ అధికారులు జిల్లాలోని పలు కళాశాలలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తుంటారు. కానీ ప్రస్తుతం వేసవి కారణంగా రక్త దాతలు ముందుకు రాకపోవడం పరీక్షల సమయం కావడంతో విద్యాసంస్థలకు సెలవులు రావడంతో రక్త సేకరణ సైతం తగ్గుతోంది. సుమారు 35రోజుల వరకే రక్తాన్ని నిల్వ చేసే అవకాశం ఉండడంతో సేకరణ తగ్గి నిల్వల కొరత అధికమవుతుంది. రక్త సేకరణ విషయంలో జిల్లా యంత్రాంగం, ఆరోగ్యశాఖ అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఏటా వేసవిలో రక్త నిల్వల కొరత ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ముందస్తు ప్రణాళిక రూపొందించి రక్తాన్ని సేకరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా, బోధన్ ఏరియా ఆసుపత్రిలో రక్త నిల్వల సమస్య తలెత్తకుండా దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే బోధన్ జిల్లా ఆసుపత్రిలో రక్త నిల్వల సమస్య తలెత్తకుండా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్‌లు, యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాలు స్పందించాలని కోరుతున్నారు.

● స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి..

: డాక్టర్ సుమంత్ కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, బోధన్



రక్తదానానికి మించిన దానం మరొకటి లేదు. రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుతుంది. రక్తదానంపై అపోహలు వీడి ప్రజలు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి. స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, యువత స్పందించి రక్తదానం చేస్తేనే ఆపదలో ఉన్న వారికి అవసరయే రక్త నిల్వలు అందుబాటులో ఉంటాయి. వీలైనంత మేరకు రక్తాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఏర్గట్ల మండంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్‌లో నీటిని నింపుతున్న ఫారెస్ట్ అధికారులు



వన్యప్రాణులకు తాగునీరు

- ట్యాంకర్ల సహాయంతో సాసర్ పిట్స్‌ను నీటితో నింపుతున్న అటవీ అధికారులు



ఏర్గట్ల, ఏప్రిల్ 15: మండుతున్న ఎండల నేపథ్యంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మండంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నాలుగు సాసర్ పిట్స్ (నీటితొట్లు)లో ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి నింపుతోంది. అటవీ ప్రాంతంలో సంచరించే జింకలు, ఎలుగుబంట్లు, నెమళ్లు, కొండగొర్లు, దుప్పిలు, కోతులు, పక్షలు, కుందేళ్ల దాహార్తిని తీర్చుతోంది. సోమవారం మండలంలోని అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల కోసం ట్యాంకర్ల ద్వారా సాసర్ పిట్స్‌లో నీరు నింపామని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాం రాథోడ్ తెలిపారు. పది రోజులకోసారి సాసర్ పిట్స్‌లో నీరు నింపుతామని తెలిపారు. ఇందులో కమ్మర్‌పల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.లింగన్న, సిబ్బంది ఉన్నారు.



అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: మున్సిపల్ పరిధి లోని అంబేద్కర్‌చౌరస్తా, కొత్తబస్టాండ్, పెర్కిట్ బస్టాండ్‌లలో సోమవారం ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగా హన కల్పిం చారు. అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా ప్రధాన కూడళ్లపై అగ్నిమాపక సిబ్బంది ఫైరిం జన్‌తో విన్యాసాలు చేశారు. అలాగే అగ్నిప్ర మాదం సంభవించకుండా తీసుకోవాల్సిన జా గ్రత్తలను ప్రజలకు సూచిం చారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్ఎఫ్‌లు ప్రకాష్, అనంత్‌రావు, ఎఫ్ఎం వంశీ, రాజ్‌కుమార్, విజయేం దర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్15: మండలంలోని జక్రాన్‌పల్లి, ఇంద్ర నగర్, అర్గుల్ పాఠశాలలను సోమవారం అధికారులు సంద ర్శించి పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఎంపీడీవో అడిగితెలుసుకున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్15: మండలంలోని ఫత్తేపూర్ గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సోమ వారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. తెలి సిన సమాచారం మేరకు ఫత్తేపూర్ గ్రామశివారులో దాడి చేయగా వారి వద్ద నుంచి రూ.7410 స్వాధీనం చేసుకొని పేకాట రాయుళ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

ఎలుగుబంటి దాడిలో గాయపడిన బాలగౌడ్


గాయపడిన బాలగౌడ్

సిరికొండ ఏప్రిల్ 15 : కొండాపూర్ గ్రామానికి చెందిన మొగుళ్ల బాలాగౌడ్(55)ను సోమవారం తెల్లవారు జామున అడవీలో ఎలుగుబంట్లు దాడిచేసిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పడప్పుడు అడవీ వెళ్లికి కట్టెలు తెచ్చి అమ్ముకుంటాడు.అతనికి ఎవరు లేనందున ఇలా జీవిస్తున్నాడు ఆయన నిత్యం చేసే విధంగా సోమవారం తెల్లవారు జామున అడవి మార్గంలో నడుచుకుంటూ కొండాపూర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో ఎలుగుబంట్లు దాడి చేసి గాయపరిచాయి. ఉదయం వేళలో గ్రామానికి వచ్చిన బాలగౌడ్ జరిగిన సంఘటన చెప్పగా బంధువులు, గ్రామస్థులు 108 అంబులెన్స్‌కు కాల్ చేయగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలగౌడ్ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు.

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిక



బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఏప్రిల్15: మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి సుమారు 50మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరగా వారికి బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు బీజేపీ పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, ఎంపీటీసీ రాజు, గంగారెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల హర్షం వ్యక్తం


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్15: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూ మన్న హర్షం వ్యక్తం చేశా రు. సోమవారం జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెం ట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్య ర్థికే మాదిగలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకర ణ చేస్తామని పదేళ్లు అయిన చేయ లేదని, వర్గీకరణ చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ తీర కమిటీ పేరున కాలయాపన చేస్తున్నారని, మాదిగ లపై చిత్తశుద్ధి లేదని అన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో దళి తు లపై దాడులు, అత్యాచారాలు, హ త్యలు జరుగుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి. కుమార్, గంగోని స్వామి, మే తరి సాయన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఏప్రిల్15: ఆర్మూర్ పట్టణంలోని నవనథ సిద్ధుల గుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సిద్ధులగుట్టకు విచ్చేసిన భక్తులు రామాలయం, దుర్గామాత, దత్తాత్రే య, అయ్యప్ప, ఎల్లమ్మ తల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. సిద్ధులగుట్ట ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు అధిక సంఖ్యలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధులగుట్ట ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ. గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, అజారి సతీష్, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, ఆలిశెట్టి నరేష్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.


సిద్ధులగుట్ట శివాలయంలో పూజలందుకున్న సిద్ధేశ్వరుడు

ఇదీ.. ఆర్టీసీ బస్టాండేనా..?!

● దుర్గంధభరితంగా మారిన ఆర్మూర్ బస్టాండ్ ● ఇబ్బందుల్లో ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద మెయిన్‌రోడ్డుపై డ్రైనేజీ లీకేజీ


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతలో నిలిచిన వర్షపు నీరు


బస్టాండ్‌లోకి వస్తున్న మురికినీరు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 15: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌కు సమస్యలు చుట్టు ముడుతున్నాయి. ఇదీ ఆర్టీసీ బస్టాండ్‌డేనా? అనే విధంగా అనిపిస్తుందని ప్రయాణికులు అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే మెయిన్‌రోడ్డుపై వెళ్ళాల్సిన డ్రైనేజీకి లీకేజీలు ఏర్పడి బస్టాండ్‌లోకి రావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిజాంసాగర్‌కెనాల్ బ్రిడ్జి సమీపం నుంచి బస్టాండ్ ఇన్ గేట్ వరకు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యి పనులు ప్రారంభించి నిలిపివేశారు. డ్రైనేజీ నీరు బయటకు రావడంతో దుర్గంధం వ్యాపించడంతో పాటు బస్సులు వెళ్లే సమయంలో ప్రయాణికులపై మురికినీరు పడుతున్నాయి. బస్టాండ్ మధ్య ద్వారం వద్ద సైతం డ్రైనేజీ పైపు సరిగ్గా లేకపోవడంతో వచ్చిపోయే ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఆ స్థలంలోనే ఎన్నో ఏళ్ళ నుంచి చీరు వ్యాపా రులు, మహిళలు పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి పక్క నుంచి వెళ్లే మురికినీటితో ఇబ్బందులు ఎదుర వ్వడమే గాకుం డా దుర్గంధంలోనే వారు వ్యాపారాలు చేసుకోవాల్సిన పరి స్థితి ఏర్పడింది. బస్టాండ్ లోపల సైతం చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి ప్రయాణికులకు అసౌకర్యం ఏర్పడుతోంది.

● అపరిశుభ్రతకు నిలయం..

ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. బస్టాండ్ ఆవరణలో ప్రజలు, వ్యాపారులు ఇష్టరీతిన చెత్తను వేయడంతో అపరిశుభ్రంగా తయారైంది. ఆర్టీసీకి స్థలం ఎక్కువ ఉన్నప్పటికీ ఆ స్థలాన్ని చదును చేయడంలేదు. దీంతో వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వచ్చే ప్రమాదం ఉంది. ప్రయాణికులకు అసౌకర్యంగా మారుతుంది. పిల్లలు, పెద్దలు పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు.

● ప్రైవేటు వాహనాల పార్కింగ్

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా కొనసాగుతుంది. ప్రయాణికులను దించడానికి వచ్చే వాహనాలతో పాటు బస్టాండ్ ప్రవేశ ద్వారం వద్ద ప్రైవేటు వాహనాలను ఇష్టరీతిగా పార్క్ చేయడంతో లోపలికి వచ్చే బస్సులకు ఇబ్బందిగా మారింది. ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో ఆర్టీసీ డ్రైవర్‌లు అవస్థలు పడాల్సి వస్తోంది. వీటికి తోడు బస్టాండ్‌లోకి వచ్చే ఆటోల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఆటోలు సైతం బస్టాండ్ ఇన్ గేట్ వద్ద నిలిపి ఉంచడంతో సమస్యలు ఎక్కువవుతున్నాయి. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి బస్టాండ్‌లోకి మురికినీరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతలో నిలిచిన వర్షపు నీరు

మూడు నెలలుగా అస్తవ్యస్తంగా డ్రైనేజీ



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ చెడిపోయి చాలా రోజులు అయ్యింది, బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికులకు డ్రైనేజీ నీరుతో ఇబ్బందిగా మారింది. బస్టాండ్‌లో చెత్త, డ్రైనేజీ నీరు లేకుండా చూడాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

- లింగన్న, ప్రయాణికుడు, ఆర్మూర్

డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం



ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ పనులు త్వరలోనే పూర్తి చేస్తాం, డ్రైనేజీ పనుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది పనులు ప్రారంభించినప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రయా ణికుల ఇబ్బందులు తొలగిస్తాం.

- రాజు, మున్సిపల్ కమిషనర్

లయన్ నివేదన్‌కు అవార్డు ప్రదానం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్‌కు లయన్స్‌క్లబ్ గవర్నర్ లక్ష్మీ ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. ఇటీవల నివేదన్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్‌కు రూ.86వేల విరాళం అందించినందుకు గాను హైదరాబాద్‌లోని కేవీ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆయనను అభినందిం చారు. ప్రతీ లయన్స్ సభ్యు డు విరాళాలు అందజేసి ప్రపంచ వ్యాప్తంగా నిరుపేద ప్రజల అవస రాల కు స్వచ్ఛంధంగా ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ల యన్స్ క్లబ్ గ్రీన్ అధ్యక్షుడు జెంటిల్‌కిడ్స్ ప్రకాష్, కార్యదర్శి రాజేష్, చేపూర్ గణేష్, ఆకుల రాజుస్వామి, శ్రీనివాస్, దోండికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవొద్దు

మెండోర, ఏప్రిల్15: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతులు పండించిన వరిధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ప్రత్యేక అధికారి అబ్దుల్‌బారి అన్నారు. సోమవారం మండలంలో సావెల్ సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, ఏఈవో రాజేశ్వర్, సీఈవో అరుణ్, సొసైటీ డైరెక్టర్‌లు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీ

● నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


భీమ్‌గల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్15: నేను పక్కాలోకల్ అని, నాకు బుల్లెట్ దిగిన.. ఆ బుల్లెట్ కే భయపడని వ్యక్తినని.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని సేవకుడిగా పనిచేస్తానని, ఆరు గ్యారెంటీలతో ప్రజలను వచించిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు అతి తొందరలోనే కర్రు కాల్చివాత పెట్టే రోజులు వున్నాయని బీఆర్ఎస్ ఎంపీ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం భీమ్‌గల్ పట్టణంలోని మెరిడియన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్ధేశించి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ నేటికి 120 రోజుల గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని, ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు. పేదలకు కల్యాణ లక్ష్మీ కింద లక్షతో పాటు, తులం బంగారం ఇప్పటివరకు ఎందరికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు పెన్షన్, రైతులకు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో కరెంటుకోతలు మొదలయ్యాయని,కాంగ్రెస్ పార్టీ ఎన్నిరోజులుపరిపాలిస్తుందో ఆపార్టీ నాయకులకే తెలియదన్నారు. అబద్ధపు హామీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలిచారని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24కరెంటు ఇచ్చినామని, బాల్కొండ నుంచి అత్యధిక మెజార్టీ ఓట్లు రావాలని ఆకాక్షిం చారు.

● రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గింది

పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రూపంలో ఉండదని ఇంకోరూపంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ తగ్గిందని, లోకల్ బాడీ ఎలక్షన్‌లో నామరూపాలు లేకుండా పోతుందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత మహిళలకు ఉచిత బస్సు బంద్ కాబోతుందని, నష్టాలను భరించడం మావల్ల కాదు అని ఆర్టీసి చేతులు ఏత్తేస్తోందని అన్నారు. కేసీఆర్ పాలనపై అనేక రాష్ట్రాలు ఇప్పటికి ప్రజలు, నాయకులు ప్రశంసిస్తున్నారని మచ్చలేని నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్ అని రాజ్యసభ సభ్యుడు ఎంపి కేఆర్‌సురేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జడ్పీటీసీ రవి, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్:నగరంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీగా ఎన్నికైతే పద్మశాలీల కోసం పనులు చేసి పెడతానని ఆయన వారికి హామీలను ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని అన్నారు. ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉంది

● నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి


సిరికొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 15: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో ఆయన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతోనే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆరు గ్యారంటీ హామీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. ఈ హామీలు ఇతర కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో సైతం అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారని నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఖచ్చితంగా కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీని కరీఫ్‌లోగా రైతులకు అందజేస్తామన్నారు. రైతుల రుణాలు బ్యాంకర్ల ద్వారా ప్రభుత్వానికి బదలాయింపు చేసి కొత్తగా రుణాలు పొందేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 92 శాతం రైతుబంధు పథకాన్ని రైతులకు వర్తింపజేశామన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులందరికి ఈ పథకాన్ని వర్తింపజేశామని ఆయన గుర్తు చేశారు. సాగు చేయని భూములకు రైతుబంధు వర్తించదని ఆయన పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల 21 ప్యాకేజీని పూర్తి చేసి నిజామాబాద్ రూరల్ రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, వీడీసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఈసారి జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో అత్యధికంగా సీట్లు గెలుపొంది అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ఆధ్వర్యంలో గల అలయెన్స్ ప్రభుత్వమే అని నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సిరికొండ మండల కేంద్రంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో నిత్యవసర ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి పోయిందన్నారు. నిరుద్యోగం తాండవిస్తోన్న నరేంద్రమోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ధరల పెరుగుదల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇవేమి తమకు పట్టవన్నట్లు మోసపు మాటాలు చెప్పి మరో సారి అధికారంలోకి రావాలని కలలు గంటుందన్నారు. నిధులు తేక పోగా ధర్నా చేయడమేమిటని జీవన్‌రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేస్తున్నామన్నమని ఆయన వివరించారు. దేశానికి కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ అని జీవన్‌రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గెలిచి ఏమి పనులు చేపట్టకుండా ఐదేల్లు కాలక్షేపం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి,మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీమండలఅధ్యక్షుడు రవి, గడీల రాములు, తదితరులుఉన్నారు

● కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ మైనారిటీ మండల అధ్యక్షుడు గౌస్‌భాషా, సిరికొండ పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు లింగారెడ్డి,మాజీ సర్పంచ్‌లు,మైనారిటీ నాయకులు, యువకులు, గిరిజన నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారందరికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మోపాల్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే దేశంలోనే నిజామాబాద్ పార్లమెంట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మోపాల్ మండలం కార్యకర్తల సమావేశాన్ని బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న భూంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పార్లమెంట్ నియోజకవర్గం నుండి గెలిచిన కవిత, అర్వింద్‌లు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, ముప్ప గంగారెడ్డి, నగేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రత్నాకర్, మీసాల సుధాకర్, పార్టీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి, ఆయా గ్రామాల సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన భూంరెడ్డి, బాగారెడ్డి

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీపీ భూంరెడ్డి, బీజేపీ నాయకులు బాగారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వీరికి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వీరితో పాటు ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డిచ్‌పల్లి: తాను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్‌రావు నివాసంలో అల్పాహారం విందుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్న అర్వింద్ ఐదు సంవత్సరాలు గడిచిన పసుపు బోర్డు ఏర్పాటు చేయలేదని ఆయన ఎద్దేవ చేశారు. రుణమాఫీ, పసుపు బోర్డు, చక్కెర కర్మాగారం ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలం విద్యాసాగర్‌రావు, అమృతాపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యామ్‌సన్, తారాచంద్‌నాయక్, తదితరులు ఉన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

వినియోగదారుల హక్కులపై కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై రూపొందించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబ రాజు చక్రపాణి, వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మానస తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ పుట్టిన ప్రతి వ్యక్తి మరణించేంత వరకు అందరూ వినియోగదారులుగానే పరిగణింపబడుతారని ఈ క్రమంలో వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం సంక్రమించిన ఆరు హక్కులు అందరికి వర్తిస్తాయన్నారు. వస్తు సేవలపై పూర్తి సమాచారం పొందే హక్కు, వస్తు సేవలను ఎంపిక చేసుకునే హక్కు, వస్తు సేవల పై పూర్తి రక్షణ పొందే హక్కు, తగిన నష్టపరిహారం పొందే హక్కు, విధాన నిర్ణయాల్లో ప్రాతినిధ్యం వహించే హక్కు, వినియోగదారుల విద్యను పొందే హక్కులపై వినియోగదారులందరూ చైతన్యం కావాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో వినియోగదారుల కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండోట అనిల్‌కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, సాయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. నగరంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ప్రముఖ దంత వైద్యుడు వినోద్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు దంతాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సయ్యద జైనాథ్, రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ ప్రాజెక్టు చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీటీ రాసేందుకు అవకాశం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: ఐటీఐకి సంబంధించి ఏదైనా ట్రేడ్‌లలో అనుభవం ఉన్న అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు (ఏఐటీటీ) హాజరయ్యే అవకాశాన్ని ఉపాధి మరియు శిక్షణ శాఖ కల్పిస్తున్నట్లు నిజామాబాద్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో 1 మరియు 2 సంవత్సరాల కోర్సులకు ఏదైనా ట్రేడ్‌కు సంబంధించిన ఏదైనా ప్రైవేటు, గవర్నమెంట్ సంస్థలో మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండి ఆ ట్రేడ్‌లలో సర్టిఫికెట్ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19 లోపు వరంగల్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో నేరుగా వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9441784849, 9866499110 లేదా ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ములుగు ఎక్స్ రోడ్ వరంగల్‌లో సంప్రదించాలన్నారు.

'నకిలీ ఏజెంట్లపై జాగ్రత్తగా ఉండాలి'

ఖిల్లా, ఏప్రిల్ 15: విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని నమ్మించి నకిలీ వీసాలు ఇచ్చి మోసాలు చేసే ఏజెంట్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవార్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పి మోసాలకు పాల్పడతారని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కార్యాలయాలు ప్రారంభించే వారికి ఎటువంటి పరిస్థితుల్లో ఇండ్లు అద్దెకు ఇవ్వరాదని తెలిపారు. అధికారికంగా అనుమతులు లేకుండా వ్యాపారాలు నడిపే వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. గల్ఫ్ ఏజెంట్‌కు ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు సంబంధిత పోలీసు స్టేషన్ నుంచి అన్ని వివరాలు తీసుకోవాలన్నారు. అదే విధంగా విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించి అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలతో అధిక సౌండ్‌తో హోరెత్తించరాదన్నారు. డ్రోన్స్ వాడకం కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మైనర్లకు ఏ సర్టిఫికెట్ గల సినిమాలకు థియేటర్ యజమానులు అనుమతించరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే విధంగా ప్రవర్తించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ప్రారంభమైన రామాలయ బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15: శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా నాలాయిదా దివ్య ప్రబంధ పారాయణం ప్రారంభించారు. ఈ పారాయణాన్ని శ్రీమాన్ సేనాపతి వేణుగోపాలచార్యులు, గోవర్ధనం కృష్ణమాచార్యులు నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా సుభాష్‌నగర్ రామాలయంలో సోమవారం నుంచి ఏర్పాట్లను ప్రారంభించారు.

ఉపాధ్యాయురాలు మృతి

నవీపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పీజీటీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న జరినా ఫిర్దోస్(48)సోమవారం గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారని పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ తెలిపారు. గత 11సంవత్సరాలుగా నవీపేట మోడల్ పాఠశాలలో 9వ తరగతి నుండి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు ఆమె సివిక్స్ సబ్జెక్టు బోధించే వారని ఆయన పేర్కొన్నారు. గత శుక్రవారం నాడు మొదట ఆమెకు గుండె పోటు రాగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారని, తిరిగి సోమవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

- గ్యారెంటీ పథకాల పేరిట అధికారం
- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 15: రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలేదని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కులం, మతం పేరిట కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని, తుకడే తుకడే గ్యాంగ్‌తో పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించడం అవివేకమన్నారు. వికసిత్ భారత్ నినాదాన్ని ఎద్దేవా చేయడం పట్ల మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అన్ని కుటుంబ పార్టీలని, వారసుల కోసం రాజకీయాలు చేస్తున్నారని డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలన్నీ తమ వారసుల బాగుకోసం రాజకీయం చేస్తుండగా, ప్రధాని నరేంద్రమోదీ దేశం, ధర్మం, ప్రజల భవిష్యత్ కోసం పాటుపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో వరిధాన్యానికి రూ.1300 మద్దతు ధర ఉండగా, ప్రస్తుతం రూ.2వేలకు పైగా మద్దతు ధర అందజేస్తున్నామన్నారు. 2014కు ముందు పసుపు ధర రూ.6వేల లోపు ఉండగా ప్రస్తుతం రూ.20వేల వరకు వస్తుందంటే కేంద్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం తీసుకునే చర్యలే కారణమన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతకు గత ప్రభుత్వాలు కారణం కాగా రూ.6340కోట్లు వెచ్చించి కార్మగారాన్ని తెరిపించిన ఘనత మోదీదేనన్నారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభించామని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ గతంలో రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చి హామీలు అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని లక్ష్మణ్ కోరారు. శాసన సభ బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో మరోసారి బీజేపీ గెలిచి మూడో సారి అధికారంలోకి రావల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. దేశ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే మోదీ పాలనలో 80కోట్ల మందికి ఉచిత రేషన్, 10కోట్ల మందికి ఉచిత గ్యాస్, 4కోట్ల నివాస గృహాలు అందజేశారన్నారు. కాంగ్రెస్ గ్యారంటిలు ఏమయ్యాయని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

- ఏపీఓ శ్రావణి

ఎడపల్లి, ఏప్రిల్ 15: ఉపాధీహామీ పథకంలో పనిచేయటానికి వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ శ్రావణి అన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలోని బతుకమ్మ చెరువులో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన చెరువు పూడికతీత పనులను ఆమె రిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత గ్రామాలలో కూలీలకు పనులు దొరకక వలసలు వెళ్లే వారని అలా వలసలు వెళ్లకుండా గ్రామాలలోనే పనులను కల్పించి వలసలను నివారించాలనే ఉద్దేశ్యంతో ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టారని, కూలీలు అధిక సంఖ్యలో వచ్చి పనులు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వం నిర్ధేశించిన కొలతలతో పని చేసి ప్రభత్వం అందిస్తున్న కూలీని పొందాలని కూలీలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జ్యోతి, క్షేత్ర సహాయకురాలు సుచరిత, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఏపీవో శ్రావణి

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, రాకాసిపేట్‌లోని రైల్వే స్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు హైరానా పడవద్దని నివారణతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చాన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజల్లో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నర్సయ్య, మొసిన్ ఖాన్, రషీద్, రమేష్ లున్నారు.

ఖిల్లా: అగ్నిప్రమాదాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆ శాఖాధికారి నర్సింగ్‌రావ్ తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి అని ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. బైపాస్ రోడ్డు వద్ద సిబ్బంది విన్యాసాలు చేసి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మధు, ప్రషత్, సురేష్, వినోద్, సురేష్, ప్రషల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యువకుడి అదృశ్యం

రెంజల్, ఏప్రిల్ 15: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గుండ్ల గంగాప్రసాద్(33)అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గంగాప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుండి బయల్దేరి వెళ్లి రాత్రి అయిన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతుకగా ఎటువంటి సమాచారం లభ్యం అవ్వకపోవడంతో సోమవారం రెంజల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. యువకుడి సోదరి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

వర్ని, ఏప్రిల్ 15: చందూర్ మండల కేంద్రంకు చెందిన మమ్మాయ గిరి(46)సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. మృతుడు గిరి అతిగా మద్యంకు బానిసై అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తితో మనస్థాపం చెంది ప్లాస్టిక్ తాడుతో ఉరేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా

కోటగిరి, ఏప్రిల్ 15: కోటగిరి మండల కేంద్రంలోని జైనాపూర్ శివారులో సోమవారం తెల్లవారుజామున ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. జైనాపూర్ రోడ్డులో ఓ రైస్ మిల్లుకు వెళ్లాల్సిన ధాన్యం లారీ భారత్ రైస్ మిల్లు వద్ద అదుపు తప్పి కాలువలో పల్టీ కొట్టింది. ధాన్యం బస్తాలు కింద పడ్డాయి. డ్రైవర్‌కు ప్రాణపాయం తప్పింది.

మహిళను చంపిన భార్యభర్తల అరెస్టు

నవీపేట, ఏప్రిల్ 15: రెంజల్ మండలం బోర్గాంకు చెందిన పెంటేవార్ చంద్రకళ(46)అనే మహిళను హత్య చేసిన అదే గ్రామానికి చెందిన భార్యభర్తలు గంగాధర్, గోదావరిలను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, ఎస్ఐ యాదగిరి గౌడ్‌లు తెలిపారు. చంద్రకళ వద్ద ఇటీవల గంగాధర్ 50వేల రూపాయల అప్పు తీసుకున్నాడని, తిరిగి డబ్బులను ఇవ్వాలని ఆమె గట్టిగా కోరడంతో ఈ నెల 10న చంద్రకళను డబ్బులు ఇస్తామని చెప్పి ఫోన్ చేసి తమ ఇంటికి పిలిపించుకున్నారని అన్నారు. ఇంట్లో చంద్రకళకు కల్లు తాగించిన అనంతరం మధ్యాహ్నం భార్యభర్తలు చంద్రకళ తలపై గొడ్డలితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. ఇంట్లో ఉన్న రక్తం మరకలను శుభ్రం చేశారని, అనంతరం అదే రోజు రాత్రి గంగాధర్ ఎక్సెల్ మోపెడ్ వాహనంపై కవర్‌లో చుట్టిన చంద్రకళ మృతదేహన్ని మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్ నగర్ తండా సమీపంలో ఉన్న అలీసాగర్‌లో కాలువలో పడేశారని వారు వివరించారు. నిందితులైన భార్యభర్తలు గంగాధర్, గోదావరిలను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని సీఐ, ఎస్ఐలు తెలిపారు. ట్రైనీ ఐపీఎస్ అధికారిణి శేషాద్రిణి రెడ్డి ఈ కేసును స్వయంగా విచారణ జరిపారని సీఐ, ఎస్ఐలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి, ఏప్రిల్ 15: పొతంగల్ మండలంలోని కారేగాం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్(37)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కారేగాం గ్రామానికి చెందిన శివకుమార్ తన ద్విచక్ర వాహనంపై భార్యను తీసుకుని పొతంగల్ వైపు వస్తుండగా చేతన్ నగర్‌కు చెందిన గౌతం అనే యువకుడు తన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం బోధన్ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలైనట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.


చందూర్‌లో మాట్లాడుతున్న బీబీ పాటిల్

దేశ ప్రగతి మోదీతోనే సాధ్యం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

వర్ని, ఏప్రిల్ 15: దేశ ప్రగతి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ స్పష్టం చేశారు. సోమవారం చందూర్ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అక్షరాల ఆవచరణలో చూపెడుతున్న మోదీ భారతీయులందరి జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే యెడల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మెదక్, సంగారెడ్డి, బాన్సువాడ, రుద్రూరు, మద్నూరు, బైంసా వరకు నేషనల్ హైవే రోడ్ల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత బీబీ పాటిల్‌దని కొనియాడారు. కార్యక్రమంలో మండల ప్రతినిధులు నరెడ్ల నర్సింలు, అరికేల సాయిరెడ్డి, విఠల్, సుమంత్, జిల్లా నాయకులు దొరబాబు, రాచప్ప, మండల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ యజమానికి జరిమానా

నవీపేట, ఏప్రిల్ 15: మండలంలోని నాళేశ్వర్ వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై 10వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తహసీల్దార్ నారాయణ తెలిపారు. శనివారం నాళేశ్వర్ వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు సంబంధిత ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిందని తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 15: బోధన్ పట్టణంలో అధికంగా వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై సోమవారం బోధన్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ బోధన్‌లో అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహించిన, అక్రమంగా భారీ వడ్డీలు వసూలు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోధన్‌లో ఐదు ఫైనాన్స్‌పై దాడులు చేపట్టి వివరాలు సేకరించామన్నారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసు సిబ్బందిఉన్నారు.

'హనుమాన్ దీక్ష చాలా పవిత్రమైనది'

బోధన్‌రూరల్, ఏప్రిల్ 15: హనుమాన్ స్వాముల దీక్ష చాలా పవిత్రమైనదని వేద పండితులు అన్నారు. సోమవారం సాలూరలోని ఒంటికాలు హనుమాన్ దేవాలయంలో ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం, హోమం నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ శిఖర మహోత్సవాన్ని నిర్వహించారు.అనంతరం స్వాములతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, గ్రామ పెద్దలు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉరి వేసుకుని విద్యార్థిని మృతి

ఎడపల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని గోవింద్‌పూర్ కాలనీలో సోమవారం ఉదయం తెల్లవారు జామున కూనంనేని మేఘన (14) అనే విద్యార్థిని తన ఇంటిముందుగల రేకుల షెడ్డు రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవింద్‌పూర్ కాలనీలో నివాసం ఉంటున్న కూనంనేని రాధ భర్త కూనంనేని శ్రీనివాస్ నాలుగేళ్ల క్రితం మరణించడంతో కుమారుడు ఆదిత్య, కుమార్తె మేఘనతో పాటు తల్లి రాధ కలిసి జీవిస్తున్నారు. రాధ అత్తమ్మ చింతకుంట గ్రామంలోగల ఆశ్రమంలో ఉంటుంది. కుమారుడు ఆదిత్య హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం మేఘన ఉరివేసుకున్న విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం మృతురాలి అన్న ఫిర్యాదులో తమ ఆర్థిక పరిస్థితి గురించి ఇంట్లో తనతల్లితో మాట్లాడుతుండగా అవివిని, ఇంట్లో ఒంటరిగా ఉండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ నరేష్ పరిశీలించారు.

ఎడపల్లిలో రక్తదాన శిబిరం

ఎడపల్లి, ఏప్రిల్ 15: ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం తలసేమియా వ్యాధి గ్రస్తుల కొరకు రక్తదాన విబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు మల్లెపూల శ్రీనివాస్, ఎడపలి శ్రీ పాథోలాజికల్ ల్యాబ్ టెక్నీషియన్ నవీన్ గౌడ్ అద్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్బగా వారు మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తుల కొరకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని సేకరించిన రక్తాన్ని వ్యాధి గ్రస్థుల అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే'

ఖిల్లా, ఏప్రిల్ 15: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపడం జరుగుతుందని ట్రాఫిక్ ఏసీపీ. ఏ.నారయణ తెలిపారు. ప్రతి రోజు వాహనాల తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే నగరంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనం నడిపిన 27మందిని గుర్తించారన్నారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టు ఎదుట హాజరు పరిచగా ఇందులో ఇద్దరికి మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారన్నారు. జైలు శిక్ష పడిన వారిలో గొల్లగుట్టకు చెందిన నరేష్ నాయక్‌దెగావత్, మోస్రా గ్రామానికి చెందిన మదాసు సంతోష్‌గౌడ్‌లు ఉన్నారన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడరాదని ఆయన సూచించారు.

'రైతులకు మొండిచేయి'

పెద్దబజార్, ఏప్రిల్ 15: పసుపు బోర్డు తెస్తానని బాండ్ రాసి ఇచ్చి ప్రధాని మోదీ చేత పసుపు బోర్డు అనే అబద్ధపు ప్రకటనలు ఇచ్చి రైతులకు మొండిచేయి చూపారని రైతు ఐక్య కార్యచరణ కమిటీ జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతు ఓట్లతో గెలిచి రైతులకే శటగోపం పెట్టిన ఎంపీ అబద్ధాలు ఆడి రైతులను వశించడం సిగ్గుచేటని అన్నారు. రైతులను మోసం చేసిన బీజేపీ నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. కార్యక్రమంలో రైతు జేఏసీ కన్వీనర్ ప్రభాకర్, కోకన్వీనర్ అన్వేష్‌రెడ్డి, జిల్లా కమిటీ కన్వీనర్లు దేవరాం, లింగారెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణ, యాదాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగారాం, పాపయ్య, బాబన్న, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి, ఏప్రిల్ 15: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్ధిపూర్ గ్రామం కోనం చెరువులో ధర్మారంకు చెందిన పయ్యవుల రవితేజ (17) ఆదివారం రాత్రి జీవితంపై విరక్తిచెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి మేనమామ కార్తిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రవితేజ మృతదేహం బయటకు రావడంతో పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	: రూ.175	రూ.305	రూ. 325

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76,000	రూ.70,000	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)

స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లే వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)

స్క్రీన్-3 : లవ్‌గురూ (1.10, 7.15)
: డియర్ (4.20)
: గీతాంజలి మళ్లే వచ్చింది (10.25)

స్క్రీన్-4 : మైదాన్ (హిందీ) (12.00)
: మంజుమ్మల్ బాయ్స్ (3.50, 6.35)
: లవ్ గురూ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గీతాంజలి మళ్లే వచ్చింది (10.45)
: టిల్లు స్క్వేర్ (1.30, 10.40)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)

స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00)
: గీతాంజలి మళ్లే వచ్చింది (1.30, 7.30)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30, 10.20)

స్క్రీన్-3 : మంజుమ్మల్ బాయ్స్ (1.40, 4.30, 7.40, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)

నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)

విజయ్ : గీతాంజలి మళ్లే వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్